సాక్షి
గుంటూరు
బుధవారం । 4 । జూన్ । 2025



రవాణా కార్యాలయాల్లో తనిఖీలు

దాచేపల్లి: దాచేపల్లి పరిధిలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనధికార విత్తన నిల్వలపై ఆరా తీశారు.



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: పాలువాయి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ వినాయకస్వామి దేవస్థానం 31వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యోగా ప్రయోజనాలపై అవగాహన

నరసరావుపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన పెంచుతూ మంగళవారం ఆసనాలు వేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక కొత్తపేట (పశువుల ఆసుపత్రి)లోని శ్రీజగన్నాథస్వామి వారి దేవస్థానంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణు గోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, రుక్మిణి, సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమార్తెగా అలకరించారు. రాత్రి 7 గంటలకు అంకురారోపణ, కలశస్థాపన, ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. వారికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

తెనాలి: తెనాలికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. విజయవాడకు చెందిన 'తెలుగు కళారత్నాలు' సాంస్కృతిక సేవా సంస్థచే సోమవారం అర్ధరాత్రి వరకు ఏకధాటిగా 10 గంటలపాటు జరిగిన సకల కళాప్రదర్శనలో నాగేశ్వరరావు సాహిత్య ప్రదర్శనకు ఈ గౌరవం లభించింది. సంబంధిత ధ్రువీకరణ పత్రం, పతకాన్ని ఏపీ సచివాలయం ఓఎస్‌డీ డాక్టర్ ప్రభాకర్, విశ్రాంత ఆదాయ పన్ను అధికారి డాక్టర్ పతంగి చెన్నయ్య, ప్రముఖ రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవి సమక్షంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యూవీ రత్నం అందజేశారు.


జనాభా నిర్వహణపై క్యూఆర్ కోడ్‌తో ప్రజాభిప్రాయం

నరసరావుపేట: జనాభా నిర్వహణ విధానంపై ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఈ నెల 1 నుంచి 20వ తేదీ వరకు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్లు జిల్లా అర్థ గణాంకశాఖ అధికారి మాలతి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని కుటుంబాల నుంచి జనాభా నిర్వహణ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించాలని ఆదేశించారు. జేసీ సూరజ్ గనోరే, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు నాగార్జునసాగర్‌లో సామూహిక యోగా

నరసరావుపేట: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం నాగార్జునసాగర్ వద్ద బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి యోగా ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని పేర్కొన్నారు. మే 28న ఇప్పటికే కోటప్పకొండపై సామూహిక యోగా నిర్వహించామన్నారు. జూన్ 11న కొండవీడు కోట, జూన్ 18న అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం వద్ద సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 512.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

చిట్‌ఫండ్ యజమానికి బెయిల్ మంజూరు

గుంటూరు లీగల్: చిట్ ఫండ్ యజమానికి గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. పాలడుగు పుల్లారావు సాయిసాధన చిట్‌ఫండ్ కంపెనీ నడుపుతూ రూ.కోట్లు స్కామ్ చేసి ప్రజలను మోసం చేశారనే అభియోగంపై అరెస్టయ్యారు. దీనిపై నరసరావుపేట-1 టౌన్ సిట్ సీఐడీ వారు కేసు నమోదు చేశారు. ఇరువురి హామీతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

అయితానగర్‌లో జన తరంగం

- బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- ప్రియతమ నేతను చూసేందుకు కిక్కిరిసిన అభిమానులు
- దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం
- ఆద్యంతం జనసంద్రాన్ని తలపించిన తెనాలి పర్యటన



ఉప్పొంగిన అభిమానం.. తెనాలిలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జేజేలు పలుకుతున్న జన సందోహంలోని ఓ భాగం

తెనాలి: ఎటుచూసినా జనతరంగం... దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం... ప్రియతమ నేతను కనులారా చూసేందుకు ఆత్రుత, ఆరాటం... వెల్లువలా కదిలివచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్లు... జననేత కనిపించగానే చిరునవ్వులు చిందిస్తూ, ఆ క్షణాలను సెల్‌ఫోన్లలో బంధిస్తూ... హృదయం నిండా సంతోషంతో అభిమానులు మురిసిపోయారు. 'సీఎం.. సీఎం..' అంటూ తమ మనసులోని కోరికను పదేపదే నినదించారు. నడిరోడ్డుపై బహిరంగంగా పోలీసుల దాష్టీకానికి గురైన ముగ్గురు దళిత, మైనారిటీ యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలిలో చేసిన పర్యటన ఆద్యంతం జన సంద్రాన్ని తలపించింది.

బాధితులకు అండగా నిలిచేందుకు...

స్థానిక కానిస్టేబుల్‌పై ఏప్రిల్ 24వ తేదీ రాత్రి దాడి చేశారన్న ఫిర్యాదుపై పట్టణానికి చెందిన యువకుడు, ఆ సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు మంగళగిరి యువకులను ఏప్రిల్ 27వ తేదీన పోలీసులు అరెస్టు చూపారు. వాస్తవానికి ఘటన జరిగిన మరుసటిరోజునే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషనులో థర్డ్ డిగ్రీ ప్రయోగించటమే కాకుండా, అరెస్టు చూపటానికి ముందే 26, 27వ తేదీల్లో జయప్రకాష్‌నగర్‌లోని సత్యం సమాధి దగ్గర నడిరోడ్డుపై, అయితానగర్‌లోని కూడలి ప్రదేశం నన్నపనేని లింగారావు సెంటరులో టూటౌన్, త్రీటౌన్ సీఐలు ఆ యువకులను బహిరంగంగా లాఠీలతో హింసించారు. ఇందులో సత్యం సమాధి దగ్గర చేసిన భౌతికదాడి కొద్దిరోజుల క్రితం సోషల్‌మీడియాలో వైరల్ కావటం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తెనాలి వచ్చారు.

నాయకుల ఘనస్వాగతం

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.



అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన జనసమూహం

కిక్కిరిసిన అభిమానులు

వందలాది ద్విచక్ర వాహనాలు ముందు బయలుదేరగా.. వైఎస్ జగన్ కాన్వాయ్ అనుసరించింది. తెనాలి పొలిమేరల్లోని వీఎస్సార్ కాలేజీ వద్దకు చేరుకునేసరికి అప్పటికే అక్కడకు చేరుకున్న వేలాదిమంది కేరింతలు కొట్టారు. కిలోమీటరు దూరంలోని లింగారావు సెంటరుకు కాన్వాయ్ చేరుకునేందుకు 40 నిమిషాలకుపైగా సమయం పట్టింది. అయితానగర్‌కు కేంద్రమైన లింగారావు సెంటరు జనంతో కిక్కిరిసింది. ఆ జనాభిమానాన్ని చూసిన స్థానికులు, 2004 ఎన్నికల సమయంలో ప్రచారం నిమిత్తం వచ్చిన నాటి మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పర్యటనను గుర్తుచేసుకున్నారు. అక్కడి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదురు రోడ్డులోంచి బాధిత యువకుడు దోమా రాకేష్ నివాసానికి కాన్వాయ్ చేరుకోవటానికి మరికొంత సమయం పట్టింది. అప్పటికే ఆ సెంటరు అభిమానులతో కిటకిటలాడుతోంది. తమ సంక్షేమ ప్రదాతను చూసేందుకు అనువైన స్థలం దొరకనివారు సమీప డాబాలు, చెట్లపైన సర్దుకున్నారు. మాజీ సీఎం కాన్వాయ్ అక్కడకు చేరుకోగానే అభిమానులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. దీంతో కొద్దిసేపు వైఎస్ జగన్ కారులోంచి దిగలేదు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది అతికష్టంపై జనాన్ని నిలువరించగా, కారులోంచి వైఎస్ జగన్ దిగారు. ఆయనతోపాటు వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ప్రాంతీయ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని, జూపూడి ప్రభాకర్‌లకు అప్పటికే అక్కడకు చేరుకున్న మాజీ మంత్రులు డాక్టర్ మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, విడదల రజిని, ఎమ్మెల్సీలు ఎల్.అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమాలు అభివాదం చేశారు.

అభిమాన నేతపై పూలవర్షం

పర్యటన షెడ్యూలు ప్రకారం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 11.15 గంటలకు తెనాలి అయితానగర్ చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించాలి. 12 గంటలకు తిరిగి వెళ్లాల్సి ఉంది. ఆ ప్రకారం రోడ్డు మార్గాన బయలుదేరిన మాజీ సీఎం... మార్గమధ్యలో పలు గ్రామాల వద్ద వేచి ఉన్న అభిమానులకు కారులోంచి బయటకు వచ్చి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. 11 గంటల ప్రాంతంలో రూరల్ మండల గ్రామం నందివెలుగు జంక్షన్ వద్దకు చేరుకునేసరికి అక్కడ భారీసంఖ్యలో ఎదురుచూస్తున్న అభిమానులు, కార్యకర్తలు, పార్టీ నేతలు పూలవర్షం కురిపించారు.



ప్రియతమ నేతకు మద్దతుగా యువత బైక్ ర్యాలీ

అర్ధగంటపాటు పరామర్శలు

మధ్యాహ్నం 12.12 గంటలకు దోమా రాకేష్ నివాసంలో రాకేష్ తల్లిదండ్రులు వాసు - మాధవి, మంగళగిరికి చెందిన షేక్ బాబులాల్ తల్లిదండ్రులు అమీర్ బాషా - రహమ్‌తున్, చేబ్రోలుకు చెందిన జాన్ విక్టర్ తండ్రి ఇశ్రాయేల్‌ను కలిశారు. పోలీసుల హింసకు సంబంధించిన వివరాలను వారి నుంచి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. దాదాపు అర్ధగంటసేపు వారితో గడిపిన వైఎస్ జగన్ ఆ ఇంటికి సమీపంలోనే మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గెడ్డటి ఝాన్సీవాణి, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, ఆవుల కోటయ్య, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్‌బాబు, పార్టీ నేతలు కల్లం వెంకటప్పారెడ్డి, అవుతు పోతిరెడ్డి, గోల్డ్ రహిమా, బూరెల దుర్గా ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, తాడిబోయిన రమేష్, కొడాలి క్రాంతి, కాకి దేవసహాయం, మన్నవ ప్రభాక్, ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, జలగం రామకృష్ణ, గాజుల మోహన్, మల్లెబోయిన రాము, షేక్ అన్సారీ, కుర్రా జస్వంత్, అక్కిదాసు కిరణ్, గ్యాస్ సుభాని, షేక్ మీరావలి పాల్గొన్నారు.

నరనారాన నయవంచన

చంద్రబాబు మాటలు ఎప్పుడూ అబద్ధాలేనని మరోసారి తేలిపోయింది. నారా వారు మారలేదు.. నయవంచన ఆగలేదని.. నరనరాన అదే కుటిల బుద్ధి, నమ్మకద్రోహం, వెన్నుపోటు అలాగే ఉన్నాయని ఏడాది పాలన చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు సహా కూటమి నేతలు చెప్పిన మాటలు అంతా అధికారం కోసమేనని నిరూపితమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక హామీలు గాలికొదిలేసింది. అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు, హత్యలు, అవినీతి, అఘాయిత్యాలు.. ఇదీ కూటమి ఏడాది పాలన తీరు. బాబును నమ్మిన ప్రజలకు ఏడాదిగా కన్నీటి కష్టాలే మిగిలాయి.

- అన్నివర్గాలను నమ్మించి నట్టేట ముంచిన సీఎం చంద్రబాబు
- సూపర్ సిక్స్ హామీల అమలు ఊసు మరిచిన కూటమి సర్కారు
- అభివృద్ధికి మంగళం పాడి నిత్యం మాయమాటలతో పాలన
- రైతులు, మహిళలు, యువత.. ఇలా అందరికీ నమ్మక ద్రోహం
- అధికార పార్టీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలు, అక్రమాలు అనంతం
- కూటమి ఏడాది పాలనలో సామాన్యులకు తప్పని కన్నీళ్లు

కూటమి ఏడాది పాలనలో అడుగడుగునా దగా, దౌర్జన్యం




సాక్షి ప్రతినిధి, గుంటూరు, ప్రత్తిపాడు: కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఒక్కటంటే ఒక్కటీ ఏడాది గడిచినా అమలు కాలేదు. తల్లికి వందనం కింద సంవత్సరానికి ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15,000 ఇచ్చే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ప్రతీ ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ. 3000 భృతి అందజేస్తామన్నారు. ఆడబిడ్డల కోసం మహాశక్తి కార్యక్రమాన్ని తెస్తామని హామీ ఇచ్చారు. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని పేర్కొన్నారు. అన్నదాతకు ఏడాదికి రూ. 20 వేలు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ జూన్ నుంచే అమలు చేస్తామన్నారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. ''మనం హామీలిచ్చాం. సూపర్ సిక్స్ చెప్పాం. చూస్తే భయమేస్తోంది. ముందుకు కదల్లేకపోతున్నాం. ఈ విషయాలు రాష్ట్ర ప్రజానీకం కూడా ఆలోచించాలి'' అంటూ చంద్రబాబు కొత్త రాగం అందుకున్నారు.

విద్యార్థుల తల్లులకు ద్రోహం



విద్యార్థులకు ఏటా రూ. 15 వేల చొప్పున ఇస్తామన్నారు. 'తల్లికి వందనం' పథకానికి జిల్లాలో అర్హులైన విద్యార్థులు సుమారు 1.60 లక్షలు. ఏడాదికి రూ. 240 కోట్లకు పైగా అందకపోవడంతో నష్టపోయారు.

అతివలకు ఉచిత బస్.. తుస్




ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రయాణం ప్రచారంతో అందరూ నిజమే అనుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం చెప్పిన ఉగాది పోయింది... దసరా పోయింది. ప్రయాణానికి పంక్చర్ పడుతూనే ఉంది. అమలైతే జిల్లాలో రోజుకు రూ.30 లక్షల చొప్పున ఏడాదికి రూ.109 కోట్ల మేరకు మహిళలకు లబ్ధి కలుగుతుంది. ఈ ఉచితం ఇవ్వకపోవడం వల్ల ఈ మేర జిల్లాకు చెందిన మహిళలు నష్టపోయారు.

ఉచిత సిలిండర్ల అమలు 'గ్యాసే'



మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం అంతా 'గ్యాస్' అని తేలిపోయింది. చాలా మందికి తొలి విడత సబ్సిడీనే పడలేదు. రాయితీ డబ్బులు ముందుగానే ఖాతాలకు జమ చేస్తామని డప్పులు కొడుతున్నారు. జిల్లాలో 56 ఏజెన్సీల పరిధిలో 7,55,000 కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి 187.43 కోట్ల వరకు లబ్ధిదారులకు అందాలి. కానీ అమలు నామమాత్రంగానే ఉంది.

మహిళలకు సాయం హుళక్కే



ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. 19 - 59 ఏళ్ల వారికని చెప్పినా అతీగతీ లేదు. ఈ పథకం కింద జిల్లాలో 7,28,391 మందికి అర్హత ఉన్నట్లు అంచనా. ఇప్పటికే అక్షరాలా రూ.1311.10 కోట్లు వీరికి అందాలి. ఇంతవరకు ఒక్కపైసా ఇవ్వలేదు.

అన్నదాతకు వెన్నుపోటు




ఏటా రూ. 20 వేల ఆర్థిక సాయానికి దిక్కూమొక్కు లేదు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు,విత్తనాలు లేవు. కొన్ని రైతు సేవా కేంద్రాలు తెరుచుకోని దుస్థితి. గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో చిక్కుకుని కర్షకుడు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. ఉచిత పంట బీమాకు మంగళం పాడారు. జిల్లాలోని 1,24,645 మంది రైతులకు రూ. 20 వేల చొప్పున రూ.249.29 కోట్లు ఇవ్వాల్సిన చంద్రబాబు ఎగ్గొట్టారు. ఇప్పుడు ఇస్తామని చెబుతున్నా అది పెద్ద ప్రశ్నార్థకమే.

యువతకు కుచ్చుటోపీ



యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అంటూ ఊదరగొట్టారు. జిల్లాలో అక్కడక్కడా అడపాదడపా చిన్న చిన్న కంపెనీలతో జాబ్ మేళాలంటూ హడావుడి చేయడం, అలా జరిగిన వాటిలో కూడా అధికశాతం తమ్ముళ్లకే పందేరం చేశారన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాలో 18 ఏళ్ల దాటి 35 సంవత్సరాలలోపు ఉన్న యువత 3.50 లక్షల మంది అని అంచనా. ఆ ప్రకారం ఏడాదికి రూ.1098 కోట్లు ఇప్పటికే వారు నష్టపోయారు.

చిరుద్యోగులపై దౌర్జన్యాలు



చిరుద్యోగులపై దౌర్జన్యాలు, బెదిరింపులు పెరిగాయి. వలంటీర్లకు రూ.5 వేలకు బదులు రెట్టింపు ఇస్తామని విధుల్లోనే లేకుండా చేశారు. జిల్లాలో ఉన్న వందల మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్ల పొట్ట కొట్టారు. ఇక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు వీవోఏలు.. ఇలా అందర్నీ తొలగించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ముద్ర వేస్తూ సచివాలయ ఉద్యోగులను వేధిస్తూనే ఉన్నారు. మండల కేంద్రాల్లోని కార్యాలయాల్లోనే కూర్చోబెట్టి మరీ కొందర్ని టార్చర్ పెడుతున్నారు.

అవినీతి.. అక్రమాలు..



తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల అవినీతి అక్రమాలకు లెక్కేలేదు. ఇసుక, మట్టి, గ్రావెల్.. వంటి దందాలకు కొదవేలేదు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరు దొరికినంత దోచుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మెల్యేలు పర్సంటేజీలు తీసుకుంటున్నారు. ఇవ్వనోళ్లని బెదిరించి పారిపోయేలా చేశారు. కాంట్రాక్టు పనుల్లో వాటా దక్కాల్సిందే. ఉద్యోగుల బదిలీలోనూ సిఫార్సు లేఖలకు కూటమి నేతలు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు.


మోసానికి ప్రతిరూపం చంద్రబాబు



పట్నంబజారు: మోసానికి నిలువెత్తు ప్రతిరూపం ఏదైనా ఉంది అంటే.. అది చంద్రబాబే. ప్రజలను నమ్మించి.. వంచించటం ఆయనకు కొత్త ఏమీ కాదు. ఎన్నికల సమయంలో నోటికి వచ్చినట్లు హామీలు గుప్పించి... తీరా గెలిచిన తర్వాత ప్రజలను వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం. అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికి వెనకాడని వ్యక్తి చంద్రబాబు. కచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారు. సూపర్ సిక్స్ అంటూ అన్ని విధాలుగా ప్రజలను మోసం చేశారు. ఏడాది పాలన అంతా వంచన జరిగిన క్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులతోపాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలి. చంద్రబాబు మోసాలను ఎండగట్టేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– షేక్ నూరిఫాతిమా,
వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు

కూటమిది మోసపు పాలన



పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వం పనితీరుకు నిరసనగా బుధవారం పొన్నూరు నియోజకవర్గ కేంద్రంలో చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి. ఉదయం 10 గంటలకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నాం. తహసీల్దారు కార్యాలయం వరకు వెళ్లి అధికారులకు వినతిపత్రాలు అందిస్తాం. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలి.

– అంబటి మురళీకృష్ణ,
పొన్నూరు నియోజకవర్గ
వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,500** గరిష్ఠం : రూ. **2,600**

మోడల్ ధర రూ. **2,000**



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **824**

కొమ్ములు : **606** బస్తాలు

కనిష్ట :	(ధర రూ॥ల్లో) గరిష్ట :	మోడల్ :
9,800	10,700	10,325

కాయలు : **218** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,700	10,250

మొత్తం అమ్మకాలు : **618.00** క్వింటాళ్లు

–దుగ్గిరాల

దారి పొడవునా

అధినేతకు నీరాజనం

- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఊరూరా ఘన స్వాగతం
- తాడేపల్లి నుంచి తెనాలి వరకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- పలు వాహనాల్లో అభిమాన నాయకుడిని అనుసరించిన నేతలు



తెనాలి పర్యటనలో తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మంగళగిరి టౌన్/దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అడుగడుగునా ప్రజలు, అభిమానులు నీరాజనం పలికారు. పువ్వులు చల్లి ఘన స్వాగతం పలికారు. జై జగన్.. అంటూ నినదించారు. తెనాలిలో ఇటీవల పోలీసులు నడిరోడ్డుపై యువకులను చితకబాదిన సంగతి విదితమే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించడానికి తాడేపల్లిలోని తన నివాసం నుంచి మంగళవారం ఉదయం తెనాలికి వైఎస్ జగన్ బయలుదేరారు. ఈ క్రమంలో తెనాలి చేరుకునే వరకు ప్రతి ఊరు, ప్రతి ప్రాంతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చిన్నారులు, మహిళలు రోడ్డుపై వేచి చూశారు. నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి భరతమాత సెంటర్ వద్ద వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఇతర నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం కుంచనపల్లి ప్రాతూరు అండర్ పాస్ వద్ద వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షులు పాటి బండ్ల కృష్ణమూర్తి, మిరియాల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికారు. మంగళగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు పులగం సందీప్ రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షులు కలకోటి సునీల్ తదితరులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ వెంట బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి రోడ్డులో వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, బీసీ సెల్ నాయకులు కుంచాల కిషోర్ తదితరులు స్వాగతం పలికారు. మంగళగిరి నుంచి తెనాలి వెళ్లే మార్గంలో పెదవడ్లపూడి పైవంతెన వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో చేరుకుని పూలవర్షం కురిపించారు. వైఎస్ జగన్ తన కాన్వాయ్‌ను ఆపి, ప్రజలకు అభివాదం చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు కూడా అక్కడకు చేరుకుని వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. తనకోసం వచ్చిన వారందరినీ నవ్వుతూ పలకరించిన ఆయన.. అందరితో కరచాలనం చేశారు. తర్వాత అక్కడి నుంచి ముందుకు కదిలారు. దుగ్గిరాల మండల పరిధిలో మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, ఇతర గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. దుగ్గిరాల లాకుల వద్ద మండల అధ్యక్షులు శివగోపయ్య, పెరికలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, సీనియర్ నాయకులు తిమోతి, నాగేశ్వరరావు, రామకోటిరెడ్డి తదితర నాయకులు వైఎస్ జగన్ రాక కోసం వేచి చూశారు. తమ అభిమానాన్ని చాటేందుకు పెద్ద ఎత్తున పూలతో ఘన స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో జనం తరలి రావడంతో ఆ కూడలి నుంచి బయటకు రావడానికి వైఎస్ జగన్‌కు కొన్ని నిమిషాలు సమయం పట్టింది. కార్యకర్తల కోసం కాన్వాయ్ ఆపి మరీ వైఎస్ జగన్ అభివాదం చేయడంతో వారందరూ ఆనందోత్సాహంతో కేరింతలు కొట్టారు. సంతోషం వ్యక్తం చేశారు. అభిమానులు బైక్ ర్యాలీలు, కార్లలో, పలు, ఇతర వాహనాలలో అనుసరించగా.. దుగ్గిరాల నుంచి తెనాలికి జన సందోహం నడుమ వైఎస్ జగన్ వెళ్లారు.

ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ప్లకార్డుల ప్రదర్శన

తెనాలి: ఎండీయూ వాహనాల ఆపరేటర్లు తమకు న్యాయం జరిపించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తెనాలి పర్యటనలో ప్లకార్డులు ప్రదర్శించారు. తమకు జరిగిన అన్యాయాన్ని మాజీ సీఎం దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో ఎండీయూ వాహనాల ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోశాధికారి సాంబశివ రావు ఆధ్వర్యంలో ఆపరేటర్లు సిద్ధమయ్యారు. తమ డిమాండ్లను తెలియజేసే ప్లకార్డులతో సహా అయితానగర్‌కు చేరుకున్నారు. ఆయనకు వినతిపత్రం అందజేసి, తమ గోడును విన్నవించుకోవాలని ఆశించారు. కిక్కిరిసిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు మాజీ సీఎం కాన్వాయ్‌ను అనుసరించటంతో సాధ్యపడలేదు. దీనితో స్థానిక లింగారావు సెంటర్లో కారులోంచి బయకొచ్చి అభివాదం చేస్తున్న మాజీ సీఎం దగ్గరకు ప్లకార్డును తీసుకెళ్లారు. ప్లకార్డును పరిశీలించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ ప్లకార్డును తన చేతికి తీసుకుని ప్రదర్శించారు. అయితానగర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సమయంలో అక్కడ జనంలోనూ ఈ ప్లకార్డులను ప్రదర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని స్వయంగా కలిసి తమ సమస్యలను విన్నవించుకుంటామని ఆపరేటర్లు చెప్పారు.



ప్లకార్డులు చూపుతూ తమ సమస్యను తెలుపుతున్న ఆపరేటర్లు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్‌పై పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు



కూటమి పాలనలో తమ వెతలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చేందుకు ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆయా వర్గాల ప్రతినిధులు



ప్రియతమ నేత రాకను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న అభిమానులు

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం ఇద్దరు మహిళలు అక్కడ అనుమానంగా తిరుగుతుండడంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఇప్పటం గ్రామానికి చెందిన పోతగాని గోపి వేసవి సెలవులకు వేరే ఊరు వెళ్లారు. పక్కనే ఉండే గోపి తమ్ముడు పులి మనోజ్ ఇక్కడే ఉన్నారు. గోపి ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడం, అక్కడే ఇద్దరు మహిళలు ఉండడంతో వారిని అనుమానించి పోలీసులకు అప్పగించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.10 వేలతో పాటు వాచ్ పోయిందని గోపి ఫిర్యాదు ఇచ్చారు. సదరు మహిళలు మాత్రం తాము రైల్వే ట్రాక్ వెంబడి ప్లాస్టిక్ డబ్బాలు సేకరిస్తుంటామని, చోరీ చేసే ధైర్యం లేదని, తాగునీరు పట్టుకుని ఇంట్లో జామకాయలు కోస్తుండగా పట్టుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ దొంగతనం చేస్తే ఆ డబ్బు, వస్తువులు తమ వద్ద ఉండాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా బ్రెయిలీ పాఠ్యపుస్తకాలు పంపిణీ

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దృష్టిలోపం గల బాలబాలికలకు ఉచితంగా బ్రెయిలీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని, అందు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులు ఏదైన ప్రభుత్వ, ఎన్‌జీఓ, ప్రైవేట్ స్కూల్స్‌లో చదువుతున్న వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సంబంధిత హెడ్ మాస్టర్లు, ప్రిన్సిపాళ్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘరానా నేరగాడు అరెస్టు

- 16వ నంబరు హైవేపై దారిదోపిడీకి పాల్పడి పరారీ
- గంటల వ్యవధిలో పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ప్రత్తిపాడు: హైవేపై దారిదోపిడీకి పాల్పడిన యువకుల్లో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంకు చెందిన గొర్రెల కాపరి శాఖమూరి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం కొత్తమల్లాయపాలెంలో ఉన్న తన గొర్రెల మంద వద్దకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్ (21), మరో ఇద్దరు యువకులు నంబరు ప్లేటు లేని స్కూటీపై వచ్చి నడింపాలెం డొంక రోడ్డు వద్ద శ్రీనివాసరావు బైక్‌ను అడ్డగించారు. శ్రీనివాసరావు మెడపై హుక్ ఉంచి చంపుతామని బెదిరించి జేబులో ఉన్న రూ. 3,600 నగదు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా ముగ్గురు యువకులు ఆయన ముఖంపై విచక్షణా రహితంగా పిడిగుద్దులు గుద్దుతూ దాడికి పాల్పడ్డారు. బైక్ తాళం, ఫోన్ లాక్కుని పక్కనే ఉన్న పొలాల్లోకి విసిరేసి అక్కడి నుంచి బోయపాలెం వైపు పరారయ్యారు. వెంటనే తేరుకున్న శ్రీనివాసరావు ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన గ్రామస్తులు బోయపాలెం పరిసరాల్లో ముగ్గురు యువకుల కోసం గాలించారు. హైవే పరిసరాల్లో ఓ బడ్డీ బంకు వద్ద ఉండటాన్ని గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారయ్యారు. చేతికి చిక్కిన భవానీ ప్రసాద్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు శాఖమూరి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు.

పలు స్టేషన్లలో కేసులు..

గ్రామస్తులు పోలీసులకు అప్పగించిన భవానీ ప్రసాద్ గురించి ఆరా తీసిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఇతనిపై పల్నాడు జిల్లాలోని నరసరావుపేట వన్ టౌన్, టూటౌన్, రూరల్, నకరికల్, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, బాపట్ల జిల్లాలోని మార్టూరు, పెదనందిపాడు, పర్చూరు, గుంటూరు జిల్లాలోని పెదకాకాని తదితర స్టేషన్లలో 27 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కేసులన్నీ 2022 నుంచి నమోదైనవే కావడం గమనార్హం.

బాలికపై లైంగిక వేధింపులు.. కేసు నమోదు



సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, నగరంపాలెం సీఐ నజీర్ బేగ్

లక్ష్మీపురం: నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏటీ అగ్రహారం పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన మహిళ ఓ వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు కలిగాక మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తిని ఆమె రెండో వివాహం చేసుకున్నారు. మొబైల్ షాపులో పని చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు. మస్తాన్‌కు రెండో వివాహం చేయాలని ఆయన కుటుంబసభ్యులు సిద్ధం అయ్యారు. దీంతో ఆమె నిలదీయడంతో ఒంటరిగా వదిలేశాడు. ఇటీవల ఆమె కుమార్తె (8) నిద్రలో ఉలిక్కి పడటం, ఏడవడం వంటివి చేస్తుండటంతో ఏమైందని తల్లి ఆరా తీసింది. మస్తాన్ అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పింది. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.51 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, సభ్యులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సుమారు రూ.51 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ చాంబర్‌లో జరిగింది. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 143 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై సభ్యులు, వివిధ విభాగాధిపతులతో చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర శివారు, నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలలో రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు, తాగు నీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పనులకు ఆమోదం తెలిపామన్నారు. నాజ్ సెంటర్, స్వామి థియేటర్ వద్ద, అడవితక్కెళ్ళపాడులలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజు గడువు పూర్తయిన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేయడానికి ఆమోదించామన్నారు. గుంటూరు నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండటంతో వాటికి శస్త్ర చికిత్సలు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసేందుకు అదనంగా ముగ్గురు పశువుల డాక్టర్లు, ఆపరేషన్ థియేటర్ సహాయకులను నియమించాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

అండర్-23 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల అండర్-23 పురుషుల జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేశామని కమిటీ సభ్యుడు మహతి శంకర్ మంగళవారం తెలిపారు. జి.సమన్వవిత్ కెప్టెన్‌గా, షేక్ మొహమ్మద్ కౌశిక్ కీపర్‌గా, ఎ.జయచంద్ర, టి.వి.ఎస్. ఆదిత్యరెడ్డి, జి.ఆకాష్, కె.మోకేష్, నాగేంద్ర, ఆర్.వి.సుబ్బారావు, సి.హెచ్.మనోహర్‌సాయి, పి.సిద్ధిక్, షేక్ రజాక్, ఆర్.అమోల్, జి.ఆదర్శ్, ప్రియతమ్, ఎం.డి.అస్లామ్‌బేగ్, టి.శరత్‌చంద్ర, కె.ఎ.శ్రీనివాస్ సభ్యులుగా ఉంటారన్నారు. స్టాండ్‌బైలుగా ఎం.రామయ్య, ఎం.చేతన్‌కృష్ణ, ఎం.రేవంత్, ఎం.డి.ఎస్.షరీఫ్, పి.వి.సిద్ధు, కార్తీక్ రెడ్డి, కె.సుకుమార్, మనోహర్‌రెడ్డి, వి.పి.శ్రీనివాసరెడ్డి, కోచ్ కమ్ మేనేజర్‌గా డి.సరస్వతిరెడ్డి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న క్రికెట్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

లైంగికదాడి అనంతరం హత్య చేసి ఉంటారని స్థానికుల అనుమానం



మంచంపై మల్లీశ్వరి మృతదేహం, (ఇన్‌సెట్లో) మల్లీశ్వరి (ఫైల్)

తెనాలి రూరల్: తెనాలిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లైంగిక దాడి తర్వాత హత్య చేసి, ఆభరణాలు చోరీ చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... పట్టణ ముత్తెంశెట్టిపాలెం తూర్పు కాల్వ కట్ట రోడ్డులో కబేళా వంతెన నుంచి వైకుంఠపురం వెళ్లే మార్గంలో అయ్యప్పస్వామి గుడి పక్కనే తాడిపత్రి మల్లీశ్వరి (60) ఒంటరిగా నివసిస్తోంది. టిఫిన్ బండి, టీ స్టాల్, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తోంది. ప్రతి రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు లేచి టిఫిన్ బండి పనులను ప్రారంభిస్తుంటుంది. అదే సమయంలో టీ కూడా విక్రయించడంతో ఉదయాన్నే అక్కడి వారు టీ తాగేందుకు వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వచ్చిన వారు మల్లీశ్వరి బయటకు రాలేదని, ఇంటి కిటికీ నుంచి చూశారు. ఇంకా మంచంపైనే ఉంది. పిలిచినా స్పందన లేకపోవడంతో ఇదే ప్రాంతంలో నివసించే ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూడగా మల్లీశ్వరి మృతి చెంది ఉన్నట్టు గుర్తించింది.

మృతురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు, బీరువాలోని నగలు చోరీకి గురైనట్టు తెలిసింది. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు.

మృతిపై అనేక అనుమానాలు..

మల్లీశ్వరి మృతిపై స్థానికుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి తలుపునకు బయట గడి పెట్టి ఉండడం, విగతజీవిగా పడి ఉన్నప్పుడు శరీరంపై దుస్తులు సరిగా లేకపోవడం, ఆభరణాలు మాయమవడంతో ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. అనంతరం ఆభరణాలు, నగదు దోచుకెళ్లి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మల్లీశ్వరిది అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని, దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని సీఐ తెలిపారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశామని సీఈ ఎ.శివప్రసాదరావు తెలిపారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ ఆఖరుతేదీగా నిర్ణయించామన్నారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను మంగళవారం సీఈ విడుదల చేశారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఉంది. రూ. 100 ఆలస్య రుసుంతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చు. రెండో సెమిస్టర్ థియరీ పరీక్షలు జులై 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. వివరాలు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.

హత్యాచారం కేసులో నిందితులకు జీవితఖైదు

గుంటూరు లీగల్: నాగార్జున సాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై గ్యాంగ్ రేప్, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ 5వ అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. 2022లో సంచలనం రేపిన మహిళపై గ్యాంగ్ రేప్, హత్య చేసిన సంఘటనలో నిందితులు శీలం అంజి అలియాస్ చిన్న ఆంజనేయులు, సవితి చిన్న అంజి, శీలం బైస్వామిలపై నాగార్జున సాగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారించిన ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ ఈ ముగ్గురు నిందితులకు జీవితఖైదు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్షపడేలా చొరవ చూపిన పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు.